sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే

హైదరాబాద్ | 31-07-2026 శుక్రవారం | సంపుటి-02 సంచిక : 116 EDITOR: ROHINI



పదిలో రెండు ఆంధ్రప్రదేశ్ నగరాలే

దేశంలో రెండో స్థాయి నగరాల రైజింగ్



India's 'Cities on the Rise' are being built by young talent

	City	Young professionals under 25
1	Prayagraj	26.09%
2	Visakhapatnam	25.79%
3	Ranchi	24.66%
4	Jabalpur	24.61%
5	Ludhiana	21.45%
6	Surat	21.07%
7	Raipur	20.98%
8	Rajkot	19.18%
9	Vijayawada	17.63%
10	Vadodara	16.52%

News CITIES ON THE RISE 2026

పెద్ద నగరాల్లో ట్రాఫిక్ కష్టాలు భరించలేక యువత చిన్న ఊర్ల బాట పడుతోంది. మెట్రోలను వదిలి ఉద్యోగులు చిన్న నగరాల వైపు పరుగులు పెడుతున్నారు. లింక్డ్ఇన్ సిటీస్ ఆన్ ది రైజ్ నివేదిక ప్రకారం పది రెండో స్థాయి నగరాలు దేశవ్యాప్తంగా మెట్రో నగరాలకు ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్నాయి.

- సహనం వందే, అమరావతి

- విశాఖ, విజయవాడ నగరాలపై అట్రాక్షన్
- లింక్డ్ఇన్ సిటీస్ ఆన్ ది రైజ్ నివేదిక వెల్లడి
- తెలంగాణలో ఏ నగరానికీ దక్కని చోటు
- మెట్రోలకు గుడ్‌బై... కొత్త ఉపాధి బాటలు
- చిన్న ఊర్లలో ఉద్యోగాల జోరు

కార్పొరేట్ రంగంలో ఎదగాలంటే ముంబై, బెంగళూరు, ఢిల్లీ లాంటి మహా నగరాలకు వెళ్లాల్సిందే అనే రోజులు పోయాయి. ఇప్పుడు సక్సెస్ లొకేషన్ మారుతోంది. కెరీర్ ఆశయాలతో పాటు జీవన ప్రమాణాలను బ్యాలెన్స్ చేసుకోవడంపై అందరూ దృష్టి పెడుతున్నారు. దీనివల్ల పెద్ద నగరాల నుంచి చిన్న నగరాలకు టాలెంట్ మళ్లుతున్న రివర్స్ బ్రెయిన్ డ్రైన్ ట్రెండ్ కనిపిస్తోంది.

విశాఖపట్నం డిజిటల్ ఎకానమీ

విశాఖపట్నం ఇప్పుడు డిజిటల్ ఎకానమీ వైపు వేగంగా అడుగులు వేస్తోంది. గూగుల్ ఏఐ హబ్, రిలయన్స్ డేటా సెంటర్ ప్రాజెక్ట్, ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్ వంటి కంపెనీల ఎంట్రీతో వైజాగ్ టెక్ టాలెంట్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, లారస్ ల్యాబ్స్ ఇక్కడి ప్రముఖ సంస్థలుగా ఉన్నాయి. విజయవాడతోపాటు గుజరాత్‌లోని సూరత్,

వడోదర, రాజ్‌కోట్, పంజాబ్‌లోని లూధియానా, ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్,మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్, జార్ఖండ్‌లోని రాంచీ, ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ నగరాలు ఈ జాబితాలో ఉన్నాయి. దారుణం ఏంటంటే తెలంగాణకు చెందిన రెండో స్థాయి పట్టణం ఏది కూడా ఈ జాబితాలో లేకపోవడం విచారకరం.

లూధియానా, సూరత్ విస్తరణ

లూధియానా సిటీ కేవలం టెక్స్‌టైల్స్‌కే పరిమితం కాకుండా తన ఆర్థిక వ్యవస్థను విస్తరిస్తోంది. టాటా స్టీల్ రాక, హల్వారా ఎయిర్‌పోర్ట్ ప్రారంభం, మ్యారియట్ లాంటి ప్రముఖ హోటళ్ల ఎంట్రీతో ఈ నగరం దూసుకుపోతోంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ వంటివి ఇక్కడ టాప్ ఎంప్లాయర్లుగా ఉన్నాయి. డైమండ్స్, టెక్స్‌టైల్స్‌కు పెట్టింది పేరైన సూరత్ ఇప్పుడు మల్టీసెక్టార్ గ్రోత్ సిటీగా మారుతోంది. కొత్త బుల్లెట్ ట్రైన్ కారిడార్, భారీ ఎగుమతులు, వేలాది స్టార్టప్‌లతో సూరత్ ఒక అద్భుతమైన బిజినెస్ హబ్‌గా రూపాంతరం చెందుతోంది. ఆర్సెలర్ మిట్టల్, ఎల్ అండ్ టీ, రిలయన్స్ వంటి దిగ్గజ కంపెనీలు ఇక్కడ కీలక పాత్ర పోషిస్తున్నాయి.

వడోదర... ప్రయాగ్‌రాజ్... రాజ్‌కోట్ హబ్స్

గుజరాత్ కల్చరల్ క్యాపిటల్ అయిన వడోదర ఇప్పుడు వ్యాపార పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా మారుతోంది. ముంబైలో ఉండాల్సిన అనేక కుటుంబ వ్యాపారాలు వడోదర వైపు చూస్తున్నాయి. గోద్రెజ్ ప్రాపర్టీస్, అరవింద్ వంటి సంస్థలు ఇక్కడ అడుగుపెడుతున్నాయి. ఎంబిక్ ఫార్మాస్యూటికల్స్, ఎల్ అండ్ టీ సంస్థలు ఇక్కడ ప్రధానంగా ఉపాధి కల్పిస్తున్నాయి. ప్రయాగ్‌రాజ్ నగరంలో మెట్రో నెట్‌వర్క్, గంగా ఎక్స్‌ప్రెస్‌వే, పెరుగుతున్న హోమ్‌స్టేలతో మతపరమైన పర్యాటకం ఉపాధి ఇంజిన్‌గా మారుతోంది. రాజ్‌కోట్‌లో 2 లక్షలకుపైగా ఎంఎస్ఎంఈలు, భారీ ఎగుమతులు ఉన్నాయి.

జబల్‌పూర్... రాంచీ... రాయ్‌పూర్ ట్రెండ్

జబల్‌పూర్ చారిత్రాత్మకంగా డిఫెన్స్ రంగానికి గుర్తింపు పొందినప్పటికీ, ఇప్పుడు గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల ద్వారా టెక్, కమర్షియల్ టాలెంట్‌ను ఆకర్షిస్తోంది. హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంకులు ఇక్కడ ప్రముఖంగా ఉన్నాయి. జార్ఖండ్ రాజధాని రాంచీ భారీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ పుష్, జిందాల్ గ్రూప్, టాటా స్టీల్ వంటి సంస్థల రాకతో ఒక పారిశ్రామిక హబ్‌గా మారుతోంది. ఐఐటీ ధన్‌బాద్, కాన్సంట్రిక్స్ ఇక్కడ టాప్ ఎంప్లాయర్లుగా ఉన్నాయి. రాయ్‌పూర్ సెంట్రల్ ఇండియాకు కొత్త ఏఐ, ఐటీ హబ్‌గా మారుతోంది. దేశంలోనే మొదటి ఏఐ డేటా సెంటర్ పార్క్, సెమీకండక్టర్ ప్లాంట్‌తో పాటు అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చెందుతోంది.



ప్రజల ప్రాణాలకు రామ్‌దేవ్ హామీ

బీమా రంగంలోకి పతంజలి ప్రవేశం

ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు పతంజలి ప్రొడక్ట్స్ వాడే ప్రజల ముందుకు ఇప్పుడు బాబా రామ్‌దేవ్ ఏకంగా ప్రాణాలకు, ఆస్తులకు గ్యారెంటీ ఇచ్చేందుకు సరికొత్త ఇన్సూరెన్స్ వ్యాపారంతో వస్తున్నారు. కేవలం సబ్బులు, నూనెలు అమ్మిన స్థాయి నుంచి ఏకంగా రూ. 4500 కోట్ల భారీ పెట్టుబడితో బీమా రంగంలోకి అడుగుపెడుతున్న ఈ సంస్థ మాగ్మా డీల్‌తో తన సామ్రాజ్యాన్ని విస్తరిస్తోంది.

- సహనం వందే, హైదరాబాద్

- వేల కోట్ల వ్యాపారం కోసం వ్యూహం
- నమ్మకం సెంటిమెంట్... మార్కెట్ వ్యూహం
- మాగ్మాతో భారీ ఒప్పందం... 4500 కోట్ల డీల్

ఒకప్పుడు కేవలం యోగా శిబిరాలతో మొదలైన పతంజలి ప్రయాణం ఆయుర్వేద ఔషధాల వైపు మళ్ళి దేశంలోనే అతిపెద్ద ఎఫ్ఎంసీజీ కంపెనీలలో ఒకటిగా అవతరించింది. కొన్నేళ్ల కిందట దివాలా తీసిన రుచి సోయా కంపెనీని చేజిక్కించుకుని పతంజలి ఫుడ్స్‌గా మార్చిన ఈ సంస్థ, ఇప్పుడు అదే బాటలో ఇన్సూరెన్స్ రంగాన్ని శాసించేందుకు సిద్ధమవుతోంది. దశాబ్దాలుగా ప్రజల నమ్మకంపై బతికిన ఈ బ్రాండ్ ఇప్పుడు ఫైనాన్షియల్ సర్వీసులోకి అడుగుపెట్టడం నిజంగా పెద్ద సాహసమే. ఎల్ఐసీ మొదలుకుని అనేక ప్రైవేట్ దిగ్గజాలు ఏలుతున్న ఈ రంగంలోకి ఆయుర్వేద బ్రాండ్ ఎంట్రీ ఇవ్వడం మార్కెట్లో రాబోయే రోజుల్లో గట్టి పోటీ ఇస్తుందనడంలో సందేహం లేదు.

ఐఆర్‌డీఏఐ గ్రీన్ సిగ్నల్...

ఇన్సూరెన్స్ రంగంలోకి అడుగుపెట్టాలంటే మన దేశంలో సెంట్రల్ రెగ్యులేటరీ సంస్థ ఐఆర్‌డీఏఐ నుంచి అనుమతులు తప్పనిసరి. అన్ని రకాల చట్టపరమైన పరిశీలనలు, ఆర్థిక లావాదేవీల తనిఖీల తర్వాత పతంజలికి ఎట్టకేలకు ఈ అనుమతులు లభించాయి. కేవలం వస్తువు లు అమ్మే స్థాయి నుంచి ప్రజల భద్రతను చూసే స్థాయికి సంస్థ ఎదగ డం దీని ద్వారా స్పష్టమవుతోంది. రెగ్యులేటరీ అప్రూవల్స్ రావడంతో బాబా రామ్‌దేవ్ టీమ్ ఇక గ్రౌండ్ వర్క్ వేగవంతం చేసింది.

మాగ్మా డీల్... రూ. 4500 కోట్ల ప్లాన్

ఈ భారీ అడుగులో భాగంగా పతంజలి సంస్థ సుమారు రూ. 4500 కోట్ల భారీ పెట్టుబడితో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ భారీ ప్లాన్‌లో భాగంగానే మాగ్మా సంస్థతో ఒక కీలకమైన ఒప్పందం కుదిరింది. మాగ్మా ఫిన్‌కార్ప్ లేదా సంబంధిత ఆర్థిక సంస్థల నెట్‌వర్క్‌ను వాడుకుని దేశవ్యాప్తంగా ఇన్సూరెన్స్ సేవలను విస్తరించాలని పతంజలి భావిస్తోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు పతంజలికి ఉన్న గట్టి పట్టును ఈ ఇన్సూరెన్స్ వ్యాపారానికి అనుకూలంగా మలచుకోవాలని చూస్తున్నారు. ఇప్పటికే ఆయుర్వేద దుకాణాలు, పతంజలి చికిత్సాలయాలు ఉన్న ప్రతిచోటా

ఈ బీమా సేవలను సులభంగా అందుబాటులోకి తీసుకురావొచ్చనేది వాళ్ల మాస్టర్ ప్లాన్.

నమ్మకం సెంటిమెంట్... మార్కెట్ వ్యూహం

సాధారణంగా ప్రజలకు ఇన్సూరెన్స్ అనగానే పెద్ద పెద్ద పత్రాలు, క్లిష్టమైన రూల్స్, ఏజెంట్ల మోసాలు గుర్తుకు వస్తాయి. కానీ పతంజలి మాత్రం నమ్మకం అనే ఒకే ఒక్క బలమైన ఆయుధంతో ప్రజల ముందుకు వెళ్లాలని చూస్తోంది. మన దేశంలో ఇప్పటికీ కోట్లాది మంది ప్రజలకు బ్యాంకులు, బీమా సంస్థల మీద పూర్తిస్థాయి అవగాహన లేదు. కానీ బాబా రామ్‌దేవ్ పేరు చెబితే చాలు నమ్మేసే ఒక బలమైన వర్గం ఉంది. ఆ సెంటిమెంట్‌ను క్యాష్ చేసుకుని ప్రతి ఇంటికి ఆరోగ్య, జీవిత బీమాను చేరువ చేయాలనేది వాళ్ళ ఆలోచనగా కనిపిస్తోంది. సబ్బులు, నూనెలు అమ్మిన చేతులతోనే ఇకపై మన కుటుంబ భవిష్యత్తుకు రక్షణ కల్పిస్తామంటోంది.

బడుల్లో బిర్యానీ ఘుమఘుమలు

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ప్లాన్

తమిళనాడు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇకపై వారానికి ఒకసారి చికెన్ బిర్యానీ పెట్టాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ఆలోచిస్తున్నారు. చెన్నైలో గురువారం పాఠశాల విద్యాశాఖ మంత్రి రాజమోహన్ ఈ కీలకమైన ప్రతిపాదనను ముఖ్యమంత్రి ముందుంచారు. ఈ వినూత్న నిర్ణయంతో ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజన పథకం రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి.

- సహనం వందే, తమిళనాడు

- విద్యార్థులకు బిర్యానీ పెట్టాలని నిర్ణయం
- పిల్లలకు కొత్త కిక్కు... బడిలో కీలక మార్పు
- సర్కార్ స్కూళ్లకు తరలిరానున్న విద్యార్థులు

తమిళనాడులో ఇప్పటివరకు వచ్చిన ప్రతి రాజకీయ నాయకుడు కూడా పాఠశాలల పోషకాహార పథకాన్ని ఎంతో బలోపేతం చేశారని మంత్రి రాజమోహన్ స్పష్టం చేశారు. 1950వ దశకంలో నాటి ముఖ్యమంత్రి కామరాజన్ ఈ మధ్యాహ్న భోజన పథకానికి శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత కాలంలో వచ్చిన ప్రముఖులు అందరూ ఈ పథకంలో ఎన్నో రకాల మార్పులు చేసి విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా చూశారు. ఇప్పుడు ముఖ్యమంత్రి విజయ్ హయాంలో ఈ పథకాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లాలని ఆయన భావిస్తున్నారు.

గత పాలకులు తెచ్చిన చారిత్రక మార్పులు

గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన కరుణానిధి ఈ పథకంలో ఉడికించిన గుడ్లను చేర్చి విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించారు. ఎంజీఆర్ ఈ పథకాన్ని సంపూర్ణ పోషకాహార కార్యక్రమంగా మార్చి దేశానికే ఆదర్శంగా నిలిచారు. అలాగే జయలలిత కూడా వారం మొత్తం గుడ్ల పంపిణీ జరిగేలా ఈ పథకాన్ని మరింత విస్తృతం చేశారు. ఇప్పుడు అదే బాటలో తాము కూడా నడవాలని మంత్రి రాజమోహన్ ఆశపడుతున్నారు.

ప్రభుత్వ బడులలో కొత్త రుచులు

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పేద పిల్లలకు మంచి రుచికరమైన భోజనాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. వారానికి ఒక్కసారైనా విద్యార్థులకు ఇష్టమైన చికెన్ బిర్యానీని వడ్డించడం ద్వారా బడులకు వచ్చే పిల్లల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. దీంతో తమిళనాడు రాజకీయ చరిత్రలో విద్యారంగానికి పెద్దపీట వేసిన నాయకుల వరుసలో ఇప్పుడు ముఖ్యమంత్రి విజయ్ పేరు కూడా చేరనుంది. కామరాజర్ ప్రారంభించిన పథకం నుంచి నేటి బిర్యానీ ప్రతిపాదన వరకు ప్రతి అడుగు విద్యార్థుల సంక్షేమం కోసమే సాగుతోంది. ఈ ప్రతిపాదనకు ఆమోదముద్ర పడితే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇది ఒక చారిత్రక బహుమతిగా నిలుస్తుంది.

భవిష్యత్ తరాలకు పోషకాహారం

పాఠశాల దశలోనే పిల్లలకు సరైన పోషకాహారం అందితేనే భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉంటాయని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటివరకు అమల్లో ఉన్న వివిధ రకాల ఆహార పదార్థాల జాబితాలోకి ఇప్పుడు చికెన్ బిర్యానీ కూడా అధికారికంగా చేరనుంది. ఈ నిర్ణయం ద్వారా ప్రభుత్వ బడులలో చదువుకునే సామాన్య విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలల స్థాయికి సమానంగా రుచికరమైన భోజనం అందుతుంది.

పథకం అమలుపై కసరత్తు

ఈ ప్రతిపాదనను కార్యరూపంలోకి తీసుకురావడానికి విద్యాశాఖ అధికారులు అవసరమైన ఏర్పాట్లపై సమాలోచనలు జరుపుతున్నారు. చెన్నై కేంద్రంగా జరుగుతున్న ఈ కసరత్తు త్వరలోనే ఒక కొలిక్కి రానుంది. ముఖ్యమంత్రి విజయ్ దీనికి సంబంధించి తుది నిర్ణయం తీసుకున్న వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కొత్త మెనూ అమల్లోకి వస్తుంది.